క్లుప్తంగా

కల్యాణలక్ష్మి వరంలాంటిది

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దని సీఎం కేసీఆర్ రూ.లక్ష 116 సాయం అందించి పెద్ద దిక్కుగా మారారన్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం భవనం ప్రారంభించారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఉచితంగా చేపపిల్లల పంపిణీతో పాటు సబ్సిడీపై వాహనాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ స్రవంతి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా ..


నగదు అందిస్తున్న బాల్య స్నేహితులు

తంగళ్లపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని దేశాయిలపల్లె గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి (కిట్టు) కుటుంబానికి ఆయన బాల్య స్నేహితులు అండగా నిలిచారు. బుధవారం కిట్టు కుటుంబానికి రూ.53 వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, చిన్నలింగాపూర్ ఎంపీటీసీ బైరినేని రాము, వెగ్గళం శ్రీను పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం


వృద్ధుడికి కళ్లద్దాలు తొడుగుతున్న ఎంపీపీ

ముస్తాబాద్: మండలం గోపాల్‌పల్లెలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ జనగామ శరత్‌రావు బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచ్ నరేశ్, వైద్యాధికారి గీతాంజలి, హెచ్‌ఈవో యాదగిరి, గురుబాబు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసమా.?

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గంగధారి సంజీవ్ వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు. తనకున్న ఐదు ఎకరాల్లో బాస్మతి వరి పంటను సాగు చేశాడు. తన కష్టమంతా వానపాలైందని, ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వర్షానికి కోతకు వచ్చిన వరి పంట పూర్తిగా నెల పాలైందని అంటున్నాడు. ఇప్పుడు ఎకరానికి రెండు క్వింటాళ్ల వడ్లు కూడా వచ్చేలా లేవు ప్రభుత్వం తనకు పరిహారం చెల్లించి అదుకోవాలని కోరుతున్నాడు. తనకే కాదు వీర్నపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో రైతుల పరిస్థితి తనలాగే ఉందంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు.



- అకాల వర్షంతో 2 వేల ఎకరాల్లో పంట నష్టం
- అందని ఆర్థికసాయం
- ప్రతిపాదనలు పంపించిన అధికారులు
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

వీర్నపల్లి: అరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఈ సీజన్‌లో ప్రకృతి ప్రకోపానికి ఎప్పటికప్పుడు బలవుతూనే ఉన్నారు. పొలంలో విత్తనాలు నాటిన నాటినుంచి ఎన్నో కష్టాలు పడి పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతుల కష్టాన్ని హరించుకుపోయింది. ఈ నష్టాన్ని కొంతమేర తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను అదుకునేందుకు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా, ఆచరణలోకి రాలేదు.

మండలంలో 2 వేల ఎకరాల్లో వరి పంట నష్టం

మండలంలో అన్ని గ్రామాల్లో ఏప్రిల్, ఈ నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు 2 వేల ఎకరాల్లో వరి పంట నష్టపోయారు. వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించి సర్వే చేసిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారు. అయితే వానకాలం సీజన్ సిద్ధమవుతున్నా, రైతులకు పంట నష్టపరిహారం అందిస్తే పెట్టుబడికి కొంత ఇబ్బంది తగ్గుతుంది అని రైతులు అంటున్నారు.

నాలుగుసార్లు అకాల వర్షం..

ఈ వేసవి సీజన్‌లో నాలుగుసార్లు అకాల వర్షాలు కురవడంతో కోతకు వచ్చిన వరి పంటను రైతులు నష్టపోవాల్సి వచ్చింది. అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి మూడు విడతలుగా నిర్వహించిన సర్వే ఆధారంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏప్రిల్‌లో మండలంలో అయా గ్రామాల్లో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటల ఆధారంగా ప్రతిపాదనలు పంపారు. పూర్తిస్థాయి వివరాలను అయా గ్రామాల రైతుల వారీగా వివరాలు సేకరించి కమిషనరేట్ వెబ్‌సైట్‌లో పెట్టారు. రైతుల వివరాలు, దెబ్బతున్న పంట వివరాలు, సర్వే నంబర్ ఆధారంగా వీటిని నమోదు చేశారు.

పంట నష్టం అంచనా వివరాలు

గ్రామం	నష్టపోయిన రైతులు	ఎకరాలలో..
అడవిపదిర	126	157.15
గర్జనపల్లి	220	246.02
వన్‌పల్లి	270	365.27
కంచర్ల, రంగంపేట	197	341.02
మద్దిమల్ల	117	163.13
వీర్నపల్లి	437	691.17
మొత్తం	1367	1963.76

1,963 ఎకరాల్లో పంట నష్టం

మండలంలో కురిసిన అకాల వర్షానికి వరి పంటను పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. గ్రామాల్లో పంట నష్టం ఎక్కువగా జరిగినట్లుగా వ్యవసాయ అధికారులు గుర్తించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటచేలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.

గడ్డి మిగిలింది



నేను పంటకు రూ.40 వేలు ఖర్చు చేశా, పంటను కోద్దాం అనేలోపే అకాల వర్షంతో మొత్తం నేలపాలయింది. అధికారులు వచ్చి సర్వే చేసి, పరిహారం చెల్లిస్తామన్నారు. వెంటనే అందిస్తే అర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

– బోద ఎల్లయ్య, రైతు వీర్నపల్లి

ప్రతిపాదనలు పంపించాం



వీర్నపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పంటనష్టానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి ప్రతి పాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది.

– చాద భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, వీర్నపల్లి

వయో వృద్ధుల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్

సిరిసిల్లకల్చరల్: దివ్యాంగులు, వయోవృద్ధుల పోషణ, ఫిర్యాదుల కోసం ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను బుధవారం ఆర్డీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిరాధరణకు గురైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ విషయంలో ఫిర్యాదులను ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ సీనియర్ సిటీజన్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా అవసరమైన పరిష్కారాలు పొందవచ్చునన్నారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందజేయవచ్చునన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల విషయంలో ఎదురయ్యే ఇబ్బందులుంటే 14567 హెల్ప్ లైన్‌ను గానీ జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజంను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

రుద్రంగి: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే రైతులకు ప్రభుత్వం అందజేసే సబ్సిడీలను వివరించారు. కలిగే ప్రయోజనాలను, లాభాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ రైతువేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తుందన్నారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదపుటంచున ప్రయాణం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి వద్ద నైజాం కాలంలో నిర్మించిన ఇరుకు వంతెనపై ప్రయాణం వాహనాదారులకు నరకంగా మారింది. శిథిలావస్థలో ఉన్న ఈ కల్వర్టుపై ప్రయాణించడం ప్రమాదకరమని భావించిన అధికారులు పక్కనే మరో వంతెన నిర్మించినా, పాత వంతెనపై వాహనాలు వెళ్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టుపై కోతలు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కిరణ్, ఆర్‌అండ్‌బీ, ఏఈఈ
ఫోన్ నంబర్: 94408 18864

రైతులను నిండా ముంచుతున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: తెలంగాణలో రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిండా ముంచుతుందని సిరిసిల్ల కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. పదిరలో కాంగ్రెస్ జెండాను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేని స్థితిలో ఉందన్నారు. రూ.1,600 కోట్లతో సెక్రటేరియట్ కట్టిన ముఖ్యమంత్రికి రైతుల ధాన్యం తడిసిపోయి కొనుగోలు కేంద్రాల్లో ఏడుస్తుంటే ఒక్క రూపాయి పరిహారం కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ధరణి పేరుతో రైతులను ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని కూడా ఎవరి పేరు మీదనో ఆ భూమి ఉందని ధరణిలో చూపిస్తుందన్నారు. పంటలు పండక, ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ధరణి మరింత ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. చేతకాని ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్, లింగంగౌడ్, సద్ది లక్ష్మారెడ్డి, గంట బుచ్చగౌడ్, కొత్తపల్లి దేవయ్య, బాలు, రాజేందర్, ఎల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రవి, మల్లారెడ్డి, గంగయ్య, ప్రశాంత్, కిషన్, దేవా, చంద్రం, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

కొనుగోళ్లలో వేగం పెంచాలి


డీఎస్‌వోతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి

ఇల్లంతకుంట: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి మిల్లులకు తరలించాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట సివిల్ సప్లై గోదాంను డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం జితేందర్‌ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి రోహిణి కార్తె ప్రారంభమవుతుందని అన్నారు. రైతులు నార్లు పోసుకునే సీజన్ వచ్చిన కూడా ఇంకా ధాన్యం కొనుగోళ్ల పూర్తిచేయకపోవడం సరికాదని అన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వేగవంతంగా ధాన్యం తరలించాలన్నారు. మరో 10 రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ఒక్కో గ్రామానికి మూడు లారీలు పంపించాలన్నారు. రైస్‌మిల్ యాజమానులు ఎక్కువ మంది హమాలీలతో అన్‌లోడింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట: మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి చంద్రమ్మ ఇటీవల మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పరామర్శించారు. ఆయన వెంట వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జాగిరి రమేశ్‌గౌడ్, అల్లాడి రఘు పాల్గొన్నారు.

సర్పంచ్‌కూ తప్పని తిప్పలు



పై ఫొటోలో మిల్లుకు ధాన్యం తరలిస్తున్నది ఎవరో కాదు వీర్నపల్లి మండలంలోని ఎర్రగడ్డ తండా సర్పంచ్ భుక్య జగ్మాల్ నాయక్. తనకున్న వ్యవసాయ భూమిలో సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి తూకం వేసి రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో చేసేదేమిలేక ట్రాక్టర్ల సహాయంతో తానే మిల్లుకు తరలిస్తున్నాడు. అధికారులకు చెప్పిన వినకపోవడంతో తానే తరలిస్తున్నట్లు తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని మిల్లుకు తరలించాలన్నారు. – వీర్నపల్లి

శ్మశానవాటికకు దారేది..?

వేములవాడరూరల్: మండలంలోని బొల్లారం గ్రామంలో శ్మశానవాటికకు దారిలేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. మూలవాగులో చెక్‌డ్యామ్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకపోవడంతో రహదారి లేక దహన సంస్కారాల సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుసార్లు కాంట్రాక్టర్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. పనులు ప్రారంభించే సమయంలో రోడ్డు బాధ్యత తనదేనని చెప్పిన కాంట్రాక్టర్ తదుపరి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే వర్షాకాలంలోపు రోడ్డు పని పూర్తిచేయాలని కోరుతున్నారు.


శ్మశానవాటికకు అడ్డుగా నిర్మిస్తున్న చెక్‌డ్యామ్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వేములవాడరూరల్: గ్రామాల్లో గంజాయి విక్రయించినా, సేవించినా సమాచారం ఇవ్వాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి ఇబ్బందుల పాలు కావొద్దని వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ సూచించారు. మండలంలోని వట్టెంల గ్రామంలో పోలీస్ మీ కోసం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని, అలాంటి వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ప్రమాదాల బారిన పడుతారని తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

పిల్లలతో పనులు చేయించొద్దు

చిన్నారులతో పనులు చేయించొద్దని వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ అన్నారు. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ ప్రాంతం శివారులోని ఇటుక బట్టీల వద్ద ఆయన తనిఖీ చేసి చిన్నారులతో పనులు చేయించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వారికి పండ్లు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఎస్‌ఐ నాగరాజు ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐ బన్సీలాల్

రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలి

బోయినపల్లి: భారత రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులందరికి ఉచితంగా అందించాలని కోరుతూ మండల కేంద్రంలో బుధవారం మండల ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో గ్రంథం ఉచితంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ దర్శెల్లి నరేశ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎడపెల్లి బాబు, మండల అధ్యక్షుడు కొమ్ము విక్రమ్, కుర్మ సురేశ్, కుడుకల మధు, సంజీవ్, రాజేశ్ పాల్గొన్నారు.

సమాచారం

29న మండల సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

26న జిల్లా జర్నలిస్టుల మహాసభ

వేములవాడ: వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో ఈనెల 26న జిల్లా జర్నలిస్టుల ద్వితీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 మండలాలకు చెందిన ఐజేయూ జర్నలిస్టుల సంఘానికి సంబంధించిన సభ్యులంతా ఉదయం 10 గంటలకు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యలపై చర్చించడమే కాకుండా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే కార్యక్రమం ఉందన్నారు.

జూన్ 15, 16న ముదిరాజ్‌ల బోనాలు

వేములవాడ: జూన్ 15, 16 తేదీల్లో ఉప్పుగడ్డ ఏరియా ముదిరాజ్‌ల పెద్దమ్మ బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పిల్లి మధు, ప్రధాన కార్యదర్శి రేగుల రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15న పోచమ్మ బోనాలు, సాయంత్రం పెద్దమ్మ బోనాలు, 16న పెద్దమ్మ ఆలయం వద్ద దిష్టి కుంభం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రిలో పది డెలివరీలు


చిన్నారులతో డాక్టర్ల బృందం

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఒకేరోజు పది సాధారణ కాన్పులు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. ఇందులో ఆరుగురు మగ పిల్లలు, నలుగురు ఆడ పిల్లలు జన్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్‌రావు మాట్లాడుతూ మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డ జన్మించిన వారికి ఉయ్యాలను అందించామన్నారు. వేములవాడ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఏరియా ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చైతన్యసుధా, తిరుపతి, సంతోష్‌చారి, బిందు, జ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ పూర్తి


చివరి వాహనాన్ని పంపిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో ధాన్యం సేకరణ పూర్తయిందని సర్పంచ్ దమ్మ రవీందర్‌రెడ్డి తెలిపారు. పోతుగల్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం వాహనాన్ని బుధవారం మిల్లుకు పంపించామన్నారు. చైర్మన్ తన్నీరు బాపురావు, పాలకవర్గం సహకారంతో ధాన్యం సేకరణ పూర్తి చేశారన్నారు. 128 మంది రైతుల వద్ద 4,800 క్వింటాళ్ల సేకరించారన్నారు. ఉపసర్పంచ్ గూడ రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్లు సతీశ్‌చందర్, శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

ఇల్లంతకుంట: ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని బీజేపీ దళిత మోర్చా మండల ప్రధానకార్యదర్శి మామిడి హరీశ్ అన్నారు. బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా పోసి నెలన్నర అవుతున్న కూడా ఇప్పటి వరకు 30 శాతం కూడా కాంటాలు కాలేదని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని స్వామి, ప్రసన్న, బెంద్రం తిరుపతిరెడ్డి, రజినీకాంత్, వెంకటేశ్, ప్రశాంత్, వర్ధన్, అనీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.